సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 31 । మే । 2024



దివ్యవిమాన రథంపై రుక్మిణి, సత్యభామ సమేత స్వామి వారు



వేణుగోపాలుని రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

● రమణీయం.. రథోత్సవం

భక్తజనంతో వర్గల్ కిక్కిరిసింది. గోవింద నామస్మరణలతో మార్మోగింది. వేణుగోపాలుడి దివ్యవిమాన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శోభాయమానంగా అలంకరించిన విమాన రథంపై రుక్మిణి, సత్యభామ సమేతులైన వేణుగోపాలస్వామి వారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ మహోత్తర ఘట్టం వేణుగోపాలుని నవాహ్నిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఆవిష్కృతమైంది. నేత్రపర్వంగా సాగిన రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొని వేణుగోపాలుని ఆశీస్సులు పొందారు. వేణుగోపాలుని నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో కీలకమైన విమాన రథోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి.

-వర్గల్(గజ్వేల్)

న్యూస్‌రీల్

వార్డుల్లోని సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కు కౌన్సిలర్ల వినతి

సిద్దిపేటరూరల్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అధ్వానంగా మారిందన్నారు. అలాగే పైపులైన్లు ధ్వంసమయ్యాయన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాల్‌లక్ష్మి ఆనంద్, శ్రీదేవి బుచ్చిరెడ్డి, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై మల్లన్నసాగర్ నిర్వాసితుడి ఫిర్యాదు



డ్రాప్ బాక్స్‌లో వేస్తున్న నిర్వాసితుడు

గజ్వేల్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మల్లన్నసాగర్ నిర్వాసితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ కమిషన్‌కు తొగుట మండలం వేముల ఘాట్‌కు చెందిన మల్లన్నసాగర్ నిర్వాసితుడు హయతుద్దీన్ ఫిర్యాదు అందజేశారు. హైదరాబాద్‌లో ఆ కమిషన్ ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలో వేశారు. ఈ విషయాన్ని విలేకరులకు తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. జూలై 1వ తేదీ నుంచి అమలయ్యే నూతన చట్టాలపై సీపీ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాల గురించి తెలుసుకున్న సెక్షన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది నూతన చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీసీఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జానకి రామ్‌రెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆయా తేదీల్లో రైలు సేవలు బంద్

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట–సికింద్రాబాద్ మార్గంలో జూన్ 1, 2, 5, 6, 8, 9 తేదీలలో రైలు సేవలను నిలిపివేసినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా రైలు సర్వీసులను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. సిద్దిపేట–సికింద్రాబాద్ మార్గంలో రోజులో రెండు రైళ్లు రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే. రైలు సర్వీసులు రద్దు చేసిన విషయాన్ని ప్రయాణికులు గమనించి సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి13 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయన్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పరీక్షల సహాయ సంచాలకులు లక్ష్మయ్య (99088 73455)ను సంప్రదించాలన్నారు.

సదరం శిబిరం సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేటరూరల్: జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 6న మానసిక ఆరోగ్యం, కంటిచూపు సంబంధిత వారికి, జూన్ 13న చెవిటి, మూగ, కంటి చూపు వారికి, జూన్ 20న ఆర్థోపెడిక్ , జూన్ 27న ఆర్థోపెడిక్ వారికి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి హాజరు కావాల్సిన దివ్యాంగులు మీసేవా కేంద్రాల్లో వారికి సంబంధించిన వైకల్యంతో ఆన్‌లైన్ స్లాటు బుక్ చేసుకోవాలన్నారు. కేటాయించిన తేదీలలో హాజరు కావాలని సూచించారు. ఈ శిబిరాన్ని కోమటిచెరువు దగ్గరలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి హాజరుకావాలని సూచించారు.

పల్లె పాలనకు పైసల్లేవ్!

గ్రామ పంచాయతీల్లో నిధుల లేమి వెంటాడుతోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం.. నిధులు రావడం నిలిచిపోవడంతో పల్లె పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేక అనేక పనులకు ఆటంకం ఏర్పడుతోంది. నిధులు సకాలంలో రాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. మేజర్ గ్రామ పంచాయతీల్లో కొంత మెరుగ్గా ఉన్నా ఏమాత్రం ఆదాయ వనరుల్లేని సుమారు 200 గ్రామ పంచాయతీలు చిల్లి గవ్వలేక సంక్షోభంలో ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలని కార్యదర్శులు కోరుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

పంచాయతీలకు నిధుల లేమి



ఎంపీడీఓ జయరామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న అక్కన్నపేట మండల పంచాయతీ కార్యదర్శులు

- నాలుగు నెలలుగా కేటాయించని ప్రభుత్వాలు
- కష్టంగా మారిన నిర్వహణ
- 200పైగా గ్రామ పంచాయతీల్లో అయోమయం
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు
- తక్షణం కేటాయించాలంటున్న కార్యదర్శులు

జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీలున్నాయి. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కష్టాలు పడుతున్నారు. వెయ్యి లోపు జనాభా ఉన్న 183 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో ఇంటి పన్నులు సరిగ్గా చెల్లించకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వచ్చేది వర్షాకాలం కావడంతో నిధులు కేటాయించకపోతే పారిశుద్ధ్య పనులు పడకేసే ప్రమాదం ఉంటుంది. గ్రామ పంచాయతీలకు నిధుల విడుదలకు కృషి చేయాలని కోరుతూ అక్కన్నపేట మండల పరిధిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 23న ఎంపీడీఓ జయరాంకు వినతి అందజేశారు.

మూడు అకౌంట్లు..

గ్రామ పంచాయతీకి మూడు రకాల బ్యాంకు ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్తి పన్ను జమ చేసుకునే ఖాతా.. ఆస్తి పన్ను అంతంత మాత్రంగా జరగటం.. ఖర్చులు నాలుగింతలు ఉండటంతో అది ఎప్పుడూ ఖాళీగానే ఉంటోంది. రెండో ఖాతా ఎస్‌ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్). ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు జమ చేస్తారు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. కానీ గత ప్రభుత్వం హయాంలో ఎస్‌ఎఫ్‌సీ నిధులు అరకొర మంజూరుతోనే సరిపెట్టింది. మూడో ఖాతా 15వ ఆర్థిక సంఘం నిధులు ఇందులో జమ అవుతాయి. కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన జమ చేస్తోంది. ప్రతి నాలుగు నెలలకు ఒక సారి వాటిని అందజేస్తుంది. వీటిని ప్రత్యేక పనులకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. నాలుగు నెలలుగా వీటి జాడలేదు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

దృష్టిసారించని అధికారులు

గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపులైన్ లీకేజీలు, బోర్ల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్ నెలవారి కిస్తీలు, విద్యుద్దీపాలు, నెలనెలా విద్యుత్తు బిల్లు ఇవన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. ఈ బాధ్యతల గురించి ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు ఖర్చుల విషయంలో చేతులెత్తేస్తుండటంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది.

తక్షణం విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి. కార్యదర్శులపై ఆర్థిక పరమైన ఒత్తిడి తగ్గించాలి. పంచాయతీ నిర్వహణ కేవలం కార్యదర్శులనే బాధ్యులను చేయవద్దు. ప్రత్యేక అధికారులను కూడా నిర్వహణ వ్యయం భరించే విధంగా చూడాలి. నిధులు రాగానే తీసుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నా.

– నాగరాజు, జిల్లా అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్

నేరుగా అకౌంట్లలో జమ



గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తాయి. నేరుగా అకౌంట్లలో జమ అవుతాయి. కేంద్రం నుంచి విడుదల చేయగానే వస్తాయి.

– దేవకీదేవి, డీపీఓ

బడీడు పిల్లలు బడిలో ఉండాల్సిందే

3 నుంచి బడి బాట

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- విద్యా శాఖ అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: బడిబాట కార్యక్రమాన్ని జూన్ 3 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. బడీడు పిల్లలను బడుల్లో చేర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో బడిబాట నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడీడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండాల్సిందేనన్నారు. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులే కాకుండా, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు భాగస్వాములై డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించాలన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడుల్లో చేర్పించాలన్నారు. అదేవిధంగా వేల కొద్దీ ఫీజులు చెల్లించి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పిల్లలను చదివించే తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులు, ఉచిత విద్యను గురించి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పేరెంట్స్ మీటింగ్ చేపట్టాలన్నారు. విద్యార్థులను బడుల్లో చేర్పించడంలో పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం కల్పించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారి కవిత, బీసీ అభివృద్ధి అధికారి సరోజ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ శారద, డివిజనల్ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా పోలీసు, వ్యవసాయ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సీపీ అనురాధతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో ఏ ఒక్క రైతు మోసపోవద్దన్నారు. ఈ మేరకు వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో వ్యవసాయ శాఖ , పోలీస్ శాఖల అధికారులు టాస్క్ ఫోర్స్ బృందాలుగా ఏర్పడాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు.

జీలుగ విత్తనాల కొరత లేదు..

జిల్లాలో సరిపడా జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు.

ఫసల్ బీమా సద్వినియోగం చేసుకోవాలి..

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయినప్పుడు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈజీఎస్ ద్వారా ఆయిల్ పామ్, మునగ, మల్బరీ తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు రాయితీ పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్, సెరికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలే మార్గం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేటకమాన్: సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్మించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం సరళీకృత ఆర్థిక విధానాలు కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1991 నుంచి సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమయ్యాయని అన్నారు. దేశానికి ఎలాంటి దిగుమతి సుంకాలు విధించకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే వీలు కల్పించారన్నారు. వీటి ఫలితంగా ధనికులు మరింత ధనవంతులుగా, పేదలు మరింత పేదలుగా మారుతున్న పరిస్థితి ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ శక్తులకు కోట్ల రుణాలు మాఫీ చేసి, రాయితీలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, రవికుమార్, మహేష్, కనకయ్య, బాలనర్సయ్య, రాజమౌళి, కొమురయ్య, రాజనర్సయ్య, యాదగిరి, ఎల్లయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణం సీజ్



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం చిన్న కిష్టాపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాన్ని అధికారులు సీజ్ చేశారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, జగదేవ్‌పూర్ వ్యవసాయాధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్న అయ్యప్ప రైతు సేవా కేంద్రం దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఓ వసంతరావు మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసకుంటామన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు వరి, పత్తి విత్తనాలు, తెగుళ్ళ నివారణ మందులు కొనుగోలు చేయాలని కోరారు.

సమసమాజ నిర్మాణానికి పాటుపడాలి

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్

సదాశివపేట(సంగారెడ్డి): సమసమాజ నిర్మాణానికి ప్రజలందరూ పాటుపడాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు. గురువారం సదాశివపేటలోని గురుపీఠం ఆశ్రమంలో మదచల గురుపీఠ రాజయోగాశ్రమ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర అచల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలందరూ కులమతాలకతీతంగా నిస్వార్థంగా ఒక కుటుంబంలా జీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దయానంద నాగుల వెంకటేశం దంపతులు, నిర్భయానంద చందంపేట్ బస్వరాజ్, దూపం సాంబశివుడు, కందకట్ల మహేందర్, మద్దుల సోమిరెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున, మాధవరెడ్డి పాల్గొన్నారు.

● పాదయాత్రకు రక్ష..

హనుమాన్ మాలధారులు జగిత్యాల జిల్లా కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్నారు. హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, తదితర జిల్లాల హనుమాన్ భక్తులు మాల విరమణకు సిద్దిపేట మీదుగా పయనమవుతున్నారు. పాదరక్షకులు లేకుండానే నడి ఎండలో వేడిని తట్టుకునే విధంగా పాదాలకు గుడ్డలు కట్టుకొని వెళ్తుండటం విశేషం.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



పాదయాత్రగా కొండగట్టుకు వెళ్తున్న హనుమాన్ మాలధారులు

రాజముద్ర మారిస్తే తిరుగుబాటే



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగిస్తే సహించం
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: తెలంగాణ రాజముద్ర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించాలని చూడటం సహించరానిదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ పాలనపై బురద జల్లడమే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆరోపించారు. రాజముద్రలోంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో విధ్వంసానికి గురైన తెలంగాణను గాడిన పెట్టడానికి మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అందుకుభిన్నంగా పనిచేస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు సిద్ధం చేయండి

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- దుస్తుల తయారీపై ఆరా



దిలాల్‌పూర్‌లోని కుట్టు కేంద్రంలో మాట్లాడుతున్న గరీమా అగర్వాల్

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కోసం కుడుతున్న ఏకరూప దుస్తులను జూన్ 2లోగా తయారు చేసి పంపిణీకి సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. మండల పరిధిలోని దిలాల్‌పూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని నర్సరీని సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా గరీమా అగర్వాల్ మాట్లాడుతూ దుస్తుల తయారీ వల్ల మహిళలకు ఉపాధి లభించడమేకాక ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. నర్సరీలో మొక్కలను పంపిణీకి సిద్ధం చేయడంతో పాటు వర్షాలు కురవగానే నాటేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఆస్తులు, నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో దయాకర్, డీపీఎం వాసుదేవ్, ఐకేపీ సీసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వెంచర్ల పరిశీలన

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా చేపడుతున్న వెంచర్లను గరీమా అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన వెంచర్లపై ఆరాతీశారు. వెంచర్ల ఏర్పాటు, పనుల నిర్వహణ తదితర అంశాలను మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని శరణ్యకు బాలసాహిత్య పురస్కారం


శరణ్యను అభినందిస్తున్న ఎస్‌ఈఆర్‌టీ సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థి శరణ్య గురువారం జాతీయ స్థాయిలో బాలసాహిత్య పురస్కారాన్ని అందుకుంది. విద్యార్థి చేప్యాల శరణ్య రాసిన మార్పు కథకు లభించిన బహుమతిని ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య, సరోజినీ దేవి, అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ మాట్లాడుతూ.. విద్యార్థి శరణ్యకు పురస్కారం రావడం అభినందనీయమని అన్నారు.

జాతీయ పురస్కారానికి కర్కపట్ల ఉపాధ్యాయుడు


చల్లగుండ్ల మధు

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండలం కర్కపట్ల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చల్లగుండ్ల మధు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. పాఠశాలలో 1వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల అక్షరాలను తక్కువ కాలంలో సులువుగా రంగులు , బొమ్మల ద్వారా నేర్పిస్తున్నారు. ఈ నూతన ఒరవడికి వల్లూరి ఫౌండేషన్ వారు ఉపాధ్యాయుడిని జాతీయ బంగారు అవార్డుల ప్రధానోత్సవానికి ఎంపిక చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 9న హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేయనున్నట్లు మండల విద్యాధికారి ఉదయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయుడు మధు తెలిపారు.


అట్రాసిటీ కేసుపై విచారణ

- పోలీసుల సమక్షంలో ఆలయంలోకి ప్రవేశించిన దళిత స్వాములు


స్వాములతో మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేటరూరల్: సీతారాంపల్లిలో దళిత హనుమాన్ స్వాములను ఆలయంలోకి రాకుండా అగ్రవర్ణాలు అడ్డుకున్న ఘటనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం కేసు విచారణలో భాగంగా ఏసీపీ మధు సీతారాంపల్లి గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. వివక్షతకు గురైన స్వాములతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేలా ప్రతి ఒక్కరూ సంయమనంతో ఉండాలన్నారు. అనంతరం పోలీసుల సమక్షంలో దళిత హనుమాన్ స్వాములను ఆలయంలోకి ప్రవేశం చేయించారు. విచారణలో ఎస్సై అపూర్వ రెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


నరేష్‌చారి(ఫైల్)

గజ్వేల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన అహ్మదీపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాదోజి నర్సింహులు–కళమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుమారుడు నరేష్‌చారి(28) మధ్యాహ్నం వేళ ఎదురింట్లోకి వెళ్తుండగా తల్లి కళమ్మ గుర్తించింది. తిరిగి ఎంతకీ రాకపోవడంతో నరేష్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చిన తల్లి కళమ్మ ఎదురింటికి వెళ్ళి తలుపులు తెరిచి చూడగా... విగత జీవిగా పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా గజ్వేల్ సీఐ సైదా క్లూస్ టీమ్, పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా నరేష్‌ను హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఏకరూపం.. సంఘాలకు ఆదాయం

- మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే బాధ్యత
- ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదుగుదల
- జూన్ 7 లోపు పాఠశాలలకు అందించే ఏర్పాట్లు
- ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్న అధికారులు


విద్యార్థులకు దుస్తులు కుడుతున్న మహిళలు

సంగారెడ్డి టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. దీంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు దుస్తులు కుడుతూ ఉపాధి పొందుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి జిల్లాలోని అన్ని పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు అందించే చకాచకా కుడుతున్నారు. యూనిఫామ్‌లు కుట్టే ప్రక్రియను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో 18,195 సంఘాలు ఉండగా అందులో 1,90,365 మంది సభ్యులు ఉన్నారు. అందులో మండల సమైక్య సంఘాలు 25, గ్రామ సమైక్య 695 సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,896 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుడుతున్నారు. గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా జిల్లా వ్యాప్తంగా 85,002 దుస్తులు కుట్టగా అందులో బాలికలు 42,229 మంది, బాలురు 42,773 మంది ఉన్నారు. 1,070 పాఠశాలలకు జూన్ 7వ తేదీ లోపు ఏకరూప దుస్తులు అధికారులు అందజేయనున్నారు. పాఠశాలలను తెరిచే సమయానికి అందించాలని జిల్లాలోని అన్ని పాఠశాలలకు దుస్తులు చేరే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించారు. సంగారెడ్డితోపాటు జిల్లాలోని వివిధ మండలాల్లో, గ్రామాల్లో మహిళలు ఉపాధి పొందుతున్నారు. ప్రతి ఒక్కరూ ఒక్క రోజు 10 జతల చొప్పున రోజులో 7,584 జతలు కుడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో కుట్టిన ప్రతీ దుస్తువును ఆన్‌లైన్ పద్ధతిన రికార్డులను తయారు చేస్తున్నారు.

జతకు రూ.50



స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దుస్తులను కుట్టడంతో మంచి ఉపాధి పొందుతున్నాం. ఒక జత కుడితే రూ.50 ఇస్తున్నారు. అదనంగా కొంత డబ్బును పెంచి ప్రతిరోజూ పని ఉండేలా చూస్తే బాగుంటుంది.

– యాదమ్మ, కులబ్ గూరు గ్రామం

రోజుకు 8 జతలు



దుస్తులను కుట్టే పని ఇవ్వడం మంచి నిర్ణయం. దీంతో మహిళలకు ఉపాధి దొరికింది. ప్రతి రోజూ 8 నుంచి 10 జతల వరకు కుడుతున్నాం. అందరం కలిసికట్టుగా పని చేస్తున్నాం. ప్రతీ సంవత్సరం ఇలాగే ఇవ్వాలని కోరుతున్నాం. దీని ద్వారా మాకు ఉపాధి లభిస్తుంది.

– రాజమణి, సంగారెడ్డి

గడువులోపు అందిస్తాం



ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని స్వయం సహాయక సంఘ సభ్యులు ఉపయోగించుకుంటున్నారు. మహిళలకు ఆర్థికంగా లాభం చేకూరుస్తుంది. జూన్ 7వ తేదీలోపు దుస్తులు కుట్టడం పూర్తవుతుంది. గడువులోపే అన్ని పాఠశాలకు అందిస్తాం.

– కోట జంగారెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

సరళీకరణ పేరుతో ఆర్థికంగా దోపిడీ

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్


మాట్లాడుతున్న సుధాకర్

చేర్యాల(సిద్దిపేట): నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక సరళీకరణ ఆర్థిక విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలడుగు సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వాసవీ గార్డెన్‌లో జరిగిన సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఆయన జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ ఆవిర్భవించి నేటికీ 54 ఏళ్లు అవుతుందని, అప్పటి నుంచి కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. నేటి ప్రభుత్వాలు దేశంలోని కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ సరళీకరణ పేరుతో కార్మికులను ఆర్థికంగా దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. నూతన యంత్రాలను ప్రవేశపెట్టి కార్మికులకు పని లేకుండా చేసే కార్మిక వ్యతిరేఖ విధానాలపై సంఘటిత పోరాటాలకు దేశవ్యాప్తంగా కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, నాయకులు రవీందర్, రంజిత్‌రెడ్డి, భాస్కర్, కుమార్, నాగరాజు, ప్రభాకర్, మల్లేశం, శ్రీనివాస్, రవీందర్, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఆరుగురు ఆత్మహత్య

మెదక్, సిద్దిపేట జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఒక్కరోజే ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ, భార్య కాపురానికి రావడం లేదని ఇలా పలు కారణాలతో ఉరి వేసుకొని తనువు చాలించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

దుబ్బాకరూరల్: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని చిన్న నిజాంపేట గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోనపురం రాజు (29) ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో మనోవేదనకు గురై జీవితం పై విరక్తితో బుధవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక..

బెజ్జంకి(సిద్దిపేట) : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు... గ్రామానికి చెందిన గొంటి తిరుపతి(24) పశువులను మేపడానికి ఇంటి నుంచి వెళ్లాడు. భోజనానికి రాలేదని మధ్యాహ్నం ఫోన్ చేయగా వస్తున్నాని చెప్పాడు. కొద్దిసేపటి తర్వాత ఫోన్ స్విచాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన తండ్రి అంజయ్య మరి కొంత మందితో కలిసి వెతకగా రాజీవ్ రహదారి పక్కన స్కూల్ సమీపంలోని శిథిలావస్థ భవనంలో ఉరి వేసుకొని కనిపించాడు. తమ కుమారుడు కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటి నుంచి రావడం లేదని..


శ్రీకాంత్ (ఫైల్)

దుబ్బాకటౌన్: ఉరి వేసుకొని ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దౌల్తాబాద్ మండలం శేరిపల్లిలో చోటు చేసుకుంది. దౌల్తాబాద్ ఎస్ఐ ప్రేమ్‌దీప్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పసుపునూరి శ్రీకాంత్ (30), శ్రీలత దంపతులు. కూలీ నాలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఐదేళ్లలోపు కూతురు, కుమారుడు ఉన్నారు. గతేడాది నుంచి కాపురం విషయంలో తరచుగా గొడవలు పడుతున్నారు. 20 రోజుల కిందట భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరగడంతో శ్రీలత తల్లిగారిల్లయిన పొన్నాలకు వెళ్లిపోయింది. భార్య పుట్టింటి నుంచి రావట్లేదని తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీకాంత్ గురువారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో..

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన కొండపాకలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కొండపాక గ్రామానికి పోతుగంటి నర్సింలు (40) కరీంనగర్, మంచిర్యాల, గోదావరిఖని పట్టణాల్లో ఇళ్లలో టైల్స్ వర్కు పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ పోషణ, ఇతరత్ర పనుల నిమిత్తం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భాగ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

మనస్తాపానికి గురై..


ప్రశాంత్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ పట్టణం చాకలి వాడలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై పుష్పరాజ్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చాకలి ప్రశాంత్ (28)కి గత ఏప్రిల్ 4వ తేదీన చేగుంట మండలం రామంతాపూర్‌కు చెందిన మనస్వితో పెళ్లి జరిగింది. నెల రోజుల తర్వాత మనస్వి పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రశాంత్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

శివ్వంపేట(నర్సాపూర్) : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధి రత్నాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కమ్మరి సత్యనారాయణ(40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనో వేదనకు గురై బుధవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య స్వాతి, కొడుకు, కూతురు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన సత్యనారాయణ అంత్యక్రియల కోసం బాల్య స్నేహితులు ఆర్థికసాయం చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

రూ.7,363 జరిమానా, రూ.21,530 రికవరీ

- ఉపాధి హామీ పనుల్లో గుర్తించిన అధికారులు

సిద్దిపేటరూరల్: 2023–24 సంవత్సరానికి సంబంధించి రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై జరిగిన 3వ విడత సామాజిక తనిఖీ ముగింపు ఓపెన్ ఫోరం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఈ సంవత్సరంలో మొత్తంగా ఉపాధి హామీ పథకంలో 575 పనులకు గాను రూ.3,31,62,151 ఖర్చు చేశారు. వీటిలో రూ.3,06, 29,884లు కూలీలకు వేతనం చెల్లించగా, మెటీరియల్ కింద రూ. 25,32,267 ఖర్చు చేశారు. సామాజిక తనిఖీ బృందం విచారణలో అధికారుల నిర్లక్ష్యానికి సంబంధించి రూ.7,363 జరిమానా విధించగా, మస్టర్లలో కొట్టి వేతలు, కొన్ని ప్రాంతాల్లో మొక్కలు చనిపోవడం, తప్పులు రావడంతో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ. 21,530 రికవరీగా గుర్తించారు. అనంతరం అదనపు డీఆర్‌డీఏ బాలక్రిష్ణ మాట్లాడుతూ.. ఓపెన్ ఫోరం ద్వారా వచ్చిన అన్ని రకాల ఉపాధి హామీ వివరాలను ఉన్నతాధికారుల ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, డీపీఓ ప్రభాకర్, ఎంపీడీఓ రాఘవేందర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీఓ శ్రీనివాస్, ఎస్‌టీఎం దత్తు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆ ఐదుగురు ఎక్కడ?

- ఏడాది కాలంగా దొరకని ఆచూకీ
- ముగ్గురు పిల్లలతో వెళ్లిన వివాహిత
- అదే రోజు ఇంటి నుంచి వెళ్లిన గ్రామానికి చెందిన వ్యక్తి
- గాలిస్తున్న పోలీసులు


చాకలి మురళీ


మంజుల

రామాయంపేట(మెదక్): ఏడాది కిందట అదృశ్యమైన ఆ ఐదుగురి ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదు. వారి ఆచూకీ కోసం పోలీసులు, బాధిత కుటుంబాలు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. మెదక్ జిల్లా హవేళిఘన్పూర్ పోలీసులు, బాధిత కుటుంబాల కథనం మేరకు... రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన తండాకు చెందిన మంజులను 2016లో హవేళిఘన్పూర్ మండలం లింగ్‌సాన్‌పల్లి తండాకు చెందిన ఖేతావత్ రమేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఆరేళ్ల కూతురితోపాటు ఐదేళ్లు, ఏడాదిన్నర ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు నిమిత్తం రమేశ్ రెండేళ్ల కిందట సౌదీ వెళ్లాడు. ఉపాధి పనులతోపాటు కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్న మంజులకి ఉపాధి పని చేయించే క్షేత్ర సహాయకుడు, అదే గ్రామానికి చెందిన చాకలి మురళీతో పరిచయం ఏర్పడింది. గతేడాది జూన్ 15న మంజుల ముగ్గురు పిల్లలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అదే రోజు మురళీ సైతం ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఇది జరిగిన రెండు రోజులకు తన సోదరితోపాటు ఆమె ముగ్గురు పిల్లలు కనిపించడం లేదని మంజుల సోదరుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు అదృశ్యమయ్యాడని మురళీ తల్లి కూడా ఫిర్యాదు చేసింది.

రూ.3 లక్షల నగదు, బంగారంతో..

సెల్ టవర్ సిగ్నల్స్ ద్వారా వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్న క్రమంలో ఐదుగురు విజయవాడలో ఉన్నట్లు కనుగొన్నారు. బాధితురాలి బంధువులతోపాటు పోలీసులు విజయవాడ వెళ్లగా అప్పటికే వారు మరో ప్రాంతానికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి వారు ఫోన్ వాడకపోవడంతో ఆచూకీ తెలియడం కష్టతరమైంది. మురళీకి పెళ్లై పదేళ్లలోపు ఇద్దరు కుమారులున్నారు. ఏడాది కాలంగా వారి ఆచూకీ తెలియక ఇరు కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న మంజుల భర్త సౌదీ నుంచి తిరిగొచ్చాడు. ఆమె వెళ్లేటప్పుడు ఇంటి నుంచి రూ.3 లక్షల వరకు నగదు, వెండి ఆభరణాలు తీసుకెళ్లిందని భర్త రమేశ్ వాపోయాడు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం

ఏడాది కిందట అదృశ్యమైన వారి ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. విజయవాడలో ఉన్నట్లు తెలియడంతో తాము బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లగా, అప్పటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు ఫోన్లు వాడకపోవడంతో ఆచూకీ తెలియడం కష్టతరమవుతుంది.

– ఆనంద్‌గౌడ్, ఎస్ఐ, హవేళిఘనపూర్

భరోసా కేంద్రాలుగా కేవీకేలు

- సంగారెడ్డి ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ
- తునికి కేవీకేలో స్వర్ణోత్సవ వేడుకలు


తునికి కేవీకే స్వర్ణోత్సవాల్లో సేంద్రియ రైతులను సన్మానిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయ యూనివర్సిటీల్లో శాస్త్రవేత్తలు కనిపెట్టిన ఆధునిక పద్ధతులను రైతులకు తెలియజేయడంలో కేవీకేలు వారధులుగా, భరోసా కేంద్రాలుగా పని చేస్తున్నాయని సంగారెడ్డి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ తెలిపారు. దేశంలో కేవీకే ఏర్పాటు చేసి 50 ఏళ్లు అయినందున గురువారం కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాహుల్ విశ్వకర్మ మాట్లాడారు. సంగారెడ్డి ఏరువాక కేంద్రంలో వరిధాన్యం ఫౌండేషన్ సీడ్ మినీ కిట్స్ అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులకు అందజేస్తామన్నారు. అనంతరం కేవీకే హెడ్ నల్కర్ మాట్లాడుతూ.. తునికి కేవీకే నంబర్ వన్‌గా ఉందన్నారు. ఇక్కడ సేంద్రియసాగు చేస్తూ మెదక్, సిద్దిపేట జిల్లాల రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సేంద్రియ సాగు చేస్తున్న వివిధ గ్రామాలకు చెందిన 20మంది రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, డాక్టర్ ప్రతాప్ రెడ్డి, డాక్టర్ భార్గవి, ట్రైనర్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి


కార్తీక్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ శివకుమార్ కథనం మేరకు.. మెదక్ మండలం మాచవరం గ్రామానికి చెందిన బుద్దుల స్వామి కార్తీక్(14) అదే గ్రామంలోని వారి అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి పక్కనే గల దర్శనం చంద్రయ్య స్లాబ్ పైకి నిద్రించేందుకు వెళ్లాడు. స్లాబ్‌పై ఉన్న ఇనుప చువ్వను పట్టుకోవడంతో కరెంట్ షాక్‌కు గురై ముందున్న రేకులపై పడిపోయాడు. పక్కనే ఉన్న మరో విద్యార్థి నాగరాజుకు షాక్ తగిలి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వెంటనే కార్తీక్‌ను మెదక్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మెదక్‌రూరల్ పోలీసులు తెలిపారు.

గుడిసెలో బల్బు కడుతుండగా..

జిన్నారం(పటాన్‌చెరు) : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అన్నారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. ఒడిషా రాష్ట్రానికి చెందిన కైలాస ధరుహ (34)తన గుడిసె వద్ద ఉన్న చెక్కకు బల్బును కట్టే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

జీలుగ సాగు.. లాభాలు బాగు

రొట్ట పైల్ల పెంపకం లాభసాటి

- తక్కువ ఖర్చు ఎక్కువ దిగుబడి
- రోజు రోజుకూ సేంద్రియ ఎరువుల వైపు రైతుల చూపు
- తగ్గుతున్న రసాయన ఎరువుల వాడకం


జీలుగ పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మర్కూక్(గజ్వేల్): భూసారాన్ని పెంచే పశువుల ఎరువుల లభ్యత రోజురోజుకూ తగ్గిపోతున్న తరుణంలో భూములను పునరుజ్జీవింపజేయాలనే ఆలోచనతో వ్యవసాయ అధికారులు పచ్చి రొట్ట పైల్ల పెంపకం లాభసాటిగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మర్కూక్ మండలంలో గతేడాది రైతులు 1,200 ఎకరాల్లో సాగు చేస్తే ఈ సంవత్సరం వానా కాలం ప్రారంభం కాకముందే 500 ఎకరాల వరకు సాగు చేశారు. గతేడాది కంటే ఈసారి ఎక్కువగా జీలుగ సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. జీలుగ సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధిస్తున్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా భూముల్లో చల్లడం ద్వారా మందులను తట్టుకునే స్థాయి పంటలను ఆశించే స్థాయి పురుగులకు పెరుగుతుంది. దీని ద్వారా ఉత్పత్తుల నాణ్యత తగ్గిపోయి.. నీరు, సాగు నేలలు కలుషితమవుతున్నాయి.

తగ్గుతున్న రసాయన ఎరువులు..

మండలంలోని ఎర్రవల్లి, మర్కూక్, నర్సన్నపేట, దామరకుంట, వర్ధరాజ్‌పూర్, నర్సన్నపేట, పాములపర్తి, గంగాపూర్ తదితర గ్రామాల్లో రైతులు తొలకరి జల్లులు కురిసినప్పుడే వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఈ విత్తనాలను వేశారు. రోజురోజుకూ రైతుల్లో పచ్చిరొట్ట పైల్ల సాగుపై నమ్మకం కలిగి జిల్లాలోనే ఎక్కువగా సాగు చేస్తూ రసాయ ఎరువుల వాడకం తగ్గిస్తున్నారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

జీలుగ సాగు విధానం..

- ప్రతీ గ్రామంలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా జీలుగ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.
- వర్షాకాలం ఆరంభంలో తొలకరి జల్లు కురవగానే ఈ విత్తనాలు నేలలో ఎకరాకు 15 నుంచి 20 కిలోలు వెదజల్లిన తర్వాత ట్రాక్టర్‌తో దున్నాలి. 30 నుంచి 40 రోజుల్లో పంట పూత దశకు చేరుకుంటుంది.
- పూత దశలో ఉన్న పంటను ట్రాక్టర్ రోటవేటర్ లేదా ఎద్దుల సాయంతో దున్నాలి. తర్వాత సింగిల్ సూపర్ పాస్పేట్ ఎరువును భూమిలో చల్లాలి.
- అనంతరం నీరు వదలాలి. పైర్లు కుళ్లిపోయి పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతోంది. వర్షాకాలంలో భూమి కోతకు గురికాకుండా ఉంటుంది.
- జీలుగను భూమిలో దున్నడం వల్ల నత్రజని 27 శాతం, భాస్వరం 53 శాతం, పొటాషియం 22 శాతం అదనంగా అందిస్తాయి. దీని ద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుంది.

ఎరువుల వల్ల లాభాలు..



నేల సేంద్రియ పదార్థాలు వేయడం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. ఉతాక్పదకత సామర్థ్యాన్ని పెంచుకుంటాయి. నేలలో క్లిష్ట రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారించొచ్చు.

– నాగేందర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి